క్లుప్తంగా

రాజీమార్గమే రాజ మార్గం



గోవిందరావుపేట: రాజీ మార్గమే రాజ మార్గం అని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు నేటి(సోమవారం) నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొట్టుకున్న కేసులు, దొంగతనాలు, భార్య భర్తల గొడవలతో అయిన కేసులు, యాక్సిడెంట్లు, చీటింగ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఓపెన్ డ్రింకింగ్ కేసులు, పలు కేసులు ఈ లోక్ అదాలత్ లో ప్రతీ రోజు ఉదయం తొమ్మిది గంటలకు హాజరై రాజీ కుదుర్చుకోవాలని అన్నారు.

నేడు రైతులతో సమావేశం

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి రైతు వేదికలో రైతులతో నేడు(సోమవారం) సమావేశం నిర్వహించనున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి గోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులతో సమావేశం ఉంటుందని వానాకాలం సాగుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పూర్ణచందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ తెలుగు, ఇంగ్లీష్, కామర్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్ ఖాళీలను భర్తీ చేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెస్సీ బీఈడీ, బీఎస్సీ బీఈడీ ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఖాళీలకు విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గోపీనాథ్ మృతి పార్టీకి తీరని లోటు

వెంకటాపురం(కె): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ మండల అధ్యక్షులు గంపా రాంబాబు, జిల్లా నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోపీనాథ్ మృతిపై సతాపం తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు ఎంతో సేవా చేశారని పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన కారెందుల విజయ్(30) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ ఆదివారం పరామర్శించి విజయ్ మృత దేహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లి గ్రామానికి చెందిన కరాబు యువరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి 1990-91 లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.31,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంతల ప్రకాశ్ రెడ్డి, తక్కలపల్లి వెంకన్న, లింగంపల్లి వెంగళ రావు, మల్సాని రాజేశ్వరరావు, బద్దం మోహన్, ఎరుకల మాధవ్, కందుల రమేశ్, బత్తిని రమేశ్‌గౌడ్, మాటూరి శ్రీనివాస్, సాంబయ్య, తిప్పారపు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ప్రకృతి వనం

- బృహత్ పల్లె ప్రకృతి వనంలో కనిపించని మొక్కలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



మొక్కలు లేకుండా ఖాళీగా పార్కు



బృహత్ పల్లె ప్రకృతి వనం



పార్కులో ఉన్న మందు బాటిళ్లు

వాజేడు: మండలంలో నిర్మించిన బృహత్ పల్లె ప్రకృతి వనం నిరాదారణకు గురి అవుతోంది. పాత అడవిని తొలగించి కొత్తగా మొక్కలను నాటారు. అటు పాత అడవి లేక నాటిన మొక్కలు బతకకపోవడంతో మొక్కలు కానరావడం లేదు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రకృతి వనంలో మొక్కలను నాటారు. కొన్ని రోజులు నీళ్ల పట్టడంతో మొక్కలు ఎదుగుతూ వచ్చాయి. కాని తర్వాత పట్టించుకోకపోవడంతో మొక్కలు కానరావడం లేదు. బృహత్ పల్లె ప్రకృతి వనంలో పశువులు కూడా ఎక్కువగా సంచరించడంతో బతికిన ఒకటి రెండు మొక్కలను అవి తిని ఉంటాయని స్థానికులు అంటున్నారు. అలాగే ప్రస్తుతం ప్రకృతి వనం మందు బాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం కాగానే మందు బాబులు అక్కడకి వెళ్లి తాగుతున్నారు. అదే సమయంలో కొందరు ఆకతాయిలు సీసాలను పగలగొడుతున్నారు. దీంతో ఆ దారిగుండా వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టింపులేని అధికారులు

బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాలుగేళ్ల క్రితం మొక్కలను నాటిని అధికారులు తొలి రోజుల్లో బాగానే చూశారు. నిత్యం నీటిని పట్టడం చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి వేరే మొక్కలను నాటడం చేశారు. ఆ తరువాత వనంపై పట్టింపు లేకుండా పోయింది. ప్రస్తుతం బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు కానరావడం లేదు. పాత అడవిని తొలగించి కొత్తగా మొక్కలు నాటినా అవి లేక పోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు.

పాత అడవిని తొలగించారు



బృహత్ పల్లె ప్రకృతి వనం పేరుతో గతంలో ఉన్న పాత అడవిని తొలగించారు. కొత్తగా మొక్కలను నాటినప్పటికి వాటిని బతికించ లేక పోయారు. ఇప్పటికైనా మొక్కలను నాటి సంరక్షించాలి.

– గణపురపు సతీష్

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న సిద్ధాంతులు



బొడ్రాయిని ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు

మంగపేట: మండలంలోని చెరుపల్లి(కొత్తపేట)లో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. బొడ్రాయి, గ్రామ దేవతలు భూలక్ష్మి, మహాలక్ష్మి, సహిత ముత్యాలమ్మ, మైసమ్మ, గంగమ్మ, నాగులమ్మ, ఎర్రమ్మ, శ్రీ అభయాంజనేయస్వామి జీవయంత్ర విగ్రమ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఉదయం ప్రతిష్ఠాపనాచార్యులు చిట్టోజు రామాచారి, గాదె నరేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో సిద్ధాంతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు గ్రామానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ పూజారి నాగేశ్వర్‌రావు అన్నప్రసాద వితరణ చేశారు.

గ్రామ దేవతల పండుగ



గ్రామ దేవతల పండుగలో గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి, ప్రగళ్లపల్లి గ్రామాల్లో ఆదివారం ఎల్లనంపుడు (గ్రామ దేవతల), విత్తనం పండుగలను ఘనంగా నిర్వహించారు. వర్షాలు పడగానే వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగలను నిర్వహిస్తారు. అలాగే గ్రామంలోనికి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగలను నిర్వహించారు. గ్రామ దేవతల గుడి వద్ద నుంచి చెక్కలతో తయారు చేసిన చిన్న బండిని పూజల అనంతరం తీసుకువెళ్లి గ్రామాల చివరలో ఉంచారు. అనంతరం గుడి వద్ద మొక్కులను సమర్పించి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని 23 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం గంగిరేణిగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ప్రభుత్వ భవనాలపై పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇళ్లపై పెట్టలేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 22వేల 500 కోట్లను ఖర్చుపెట్టి పేద ప్రజల సొంతింటి కల కోసం కేటాయించిందన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇళ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వలేదని, నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తుంటే చూసి ఓర్వలేక శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని కాట్రపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్టు కూలి ఇల్లు ధ్వంసం

- తప్పిన పెనుప్రమాదం

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన రామగిరి వినోద ఇంటిపై చెట్టు కూలి ఇల్లు ధ్వంసమైంది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతి సింగారం గ్రామానికి చెందిన రామగిరి వినోద ఇంటిపై ప్రమాదవశాత్తు చెట్టు కూలిపడడంతో ఇల్లు ధ్వంసమైంది. ఆ స మయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. సీపీఐఎం, ఎంసీపీయూ నాయకులు చిలకల కొమురయ్య, పెంట తిరుపతిలు వినోద ఇల్లును పరిశీలించి వినోదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరారు.



ధ్వంసమైన ఇల్లు

సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట గ్రామంలో నేడు(సోమవారం)నిర్వహించనున్న రెవె న్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపల్లి, పాత ఇస్సిపేట, ఇస్సిపేట రైతులు భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్న వారి దగ్గర ఉన్న ఆధారాలతో రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐలమ్మ విగ్రహం ప్రతిష్ఠాపనకు భూమి పూజ

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురా లు, రజక జాతి ఆత్మగౌరవ ప్రతీక, వీరవనిత చిట్యాల ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆది వారం మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగా ణ సాయుధ పోరాట యోధురాలు అని కొని యాడారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు మునుకుంట్ల రవి, అల్వాల రాములు, పైళ్ల పరమేశ్వర్, మునుకుంట్ల చంద్రమౌళి, అ లువాల భాస్కర్, మునుకుంట్ల దశరథం, వైనాల రాజేందర్, పైళ్ల రమేష్ పాల్గొన్నారు.

నీటితొట్టికి మరమ్మతులు

పరకాల: పరకాల పశువుల సంతలో శిథిలావస్థలో నీటితొట్టి నిరుపయోగంగా ఉంది. పశువులకు తాగునీటికి ఇబ్బందులు పడుతుండటంతో రైతుల నుంచి ఆందోళన కావడంతో ప రకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతులు చేయించారు. వారం క్రితం నీటితొట్టిను పరిశీలించిన ఆయన తక్షణమే మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నుంచి నీటితొట్టిని పశువులకు అందుబాటులోకి తీసుకురా వడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అన్యాయం



మాట్లాడుతున్న రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాటాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఇవ్వడకుండా పది ఎకరాల భూమి ఉన్న వారిని ఎంపిక చేసిందన్నారు .అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న ఓ మీడియా ఛానల్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాజీవ్ యువ వికాస్ ఎంపికలో అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేయకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. మేడారంలో ఇసుకను కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమంగా దోచుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు, మాజీ సర్పంచులు పుల్లూరి గౌరమ్మ, జాజ చంద్రం, నాయకులు రమేష్, సయ్యద్ హుస్సేన్, రంగు సత్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'బడిబాట'



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం ఎంపీయూపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మూడో రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పుష్పలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరిస్తు కరపత్రాలు పంచిపెట్టారు. గ్రామంలో ఉన్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిష్టర్‌ను అప్‌డేట్ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారావు, రవి, రమణ, కల్యాణి తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, ప్రకాశ్, వెంకటమల్లయ్య, శ్యాంసుందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు తూటిచర్ల రాజేందర్, ఏలేటి రాజు, శ్రీధర్, పెరుమాండ్ల రాజు, నాగపూరి వెంకటేష్, కట్కూరి రాజు, బుంగ కుమార్, సరిగొమ్ముల రామకృష్ణ, కుమ్మరి నరేష్, శ్రీపతి అరుణ, కవిత, చందర్, కోక్కుల రాజు, చిక్కుల నరేష్, సంధ్యారాణి, సుదీప్త, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరిట పైసలు వసూలు చేస్తే చర్యలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల: ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు: ఇందిరమ్మ ఇల్లు భూమి పూజలో కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

పరకాల: ఇందిరమ్మ ఇళ్లు, ప్రజా సంక్షేమ పథకాల మంజూరీ పేరిట ఎవరైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 13 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పదేళ్ల తర్వాత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేసుకొని ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ సర్కారు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం అభివృద్ధిపై దృష్టిపెడుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొలం పనుల్లో రైతులు బిజీబిజీ



దుక్కి దున్నుతున్న రైతు



విత్తనాలు చల్లుతున్న రైతులు

వెంకటాపురం(కె): మండలంలో ఇటీవల వర్షాతో రైతన్నలు పొలం పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరిపంట సాగు చేసేందుకు రైతులు ఎరువును తోలటంతో పాటు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. పలువురు రైతులు వరినార్లు పోసే పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రావులపల్లిలో కోతకు గురైన రోడ్డు

రేగొండ: మండలంలోని పలు రహదారులపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. పలు చోట్ల రక్షణ గోడలు (రెయిలింగ్) శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. వీటితో ప్రమాదం జరిగే అవకాశమున్న అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రధానంగా రావులపల్లెకు వెళ్లే రోడ్డులో కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు తాకిడితో గుంతలు ఏర్పడ్డాయి. ఈ కల్వర్టు గుంతలతో వాహనదారులు ఆదమరిచినా ప్రాణానికే ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలతో సమీపానికి వచ్చే వరకు కల్వర్టు కనిపించడం లేదు. ఒకవైపు గుంతలు పడిన రోడ్లు.. ఆపై అక్కడక్కడ కూలిన కల్వర్టు ఉండడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల దృష్ట్యా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కల్వర్టుల వద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. మండలంలో కల్వర్టు వద్ద ఏర్పడ్డ గుంతలను పూడ్చివేసి, కల్వర్టు రక్షణ గోడల చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించాలి.

– బానోతు రాజేందర్, యూత్‌నాయకుడు

చేపలకు భలే గిరాకీ



చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కాటారం: మృగశిరకార్తె మొదలవడంతో ఆదివారం చేపలకు భలే గిరాకీ నెలకొంది. దీంతో మండల కేంద్రంలో చేపల విక్రయదుకాణాల వద్ద చేపల కొనుగోలు కోసం చేప ప్రియులు బారుదీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపల దుకాణాలు రద్దీగా ఉన్నాయి.